# 'టాడా'కు ఎన్ని జన్మలో ?

- కె. బాలగోపాల్

మనం ఎదుర్కొనే ప్రమాదానికి స్పష్టమైన రూపం ఉన్నట్టయితే దానిని కొంచెం ఆత్మస్థైర్యంతో ఎదుర్కొంటాం. మన బలాన్నీ దాని శక్తినీ అంచనా వేసుకొని ఎదుర్కొంటాం.

అస్పష్టమైన ప్రమాదాన్ని ఎదుర్కోవలసి వచ్చినప్పుడు మానసికంగా బలహీనపడతాం. అక్కడ నిజానికి ఏముందో తేలీదు. అది చిన్నదయితే మనం అనవసరంగా ఆవేశపడిన వాళ్ళమవుతామేమో. అది మనం ఊహించిన దానికంటే పెద్దదయితే సరిగ్గా అంచనా వేయని కారణంగా దెబ్బతింటామేమో.

రాష్ట్ర ప్రభుత్వం సంఘవ్యతిరేక శక్తులను, అసాంఘిక నేరాలనూ ఎదుర్కొనడానికొక కొత్తచట్టం తీసుకురాబోతున్నదని కొంత కాలంగా వింటున్నాం. ఆ ప్రయత్నాన్ని ఖండించినా, మానుకొమ్మని హితవు చెప్పినా ప్రభుత్వం కిమ్మనదు. అటువంటి ప్రయత్నమేదీ చేయడం లేదనదు. చేస్తాను. మీ దిక్కున్నచోట చెప్పుకొండి అనదు. ఆ వార్తలు అబద్ధమనదు, నిజమనదు.

పారదర్శక పాలన గురించి ముప్పూటలూ మాట్లాడే చంద్రబాబు రాజ్యమే కదా ఇది!

తక్కువగా అంచనా వేసుకొని దెబ్బతినడం కంటే ఎక్కువగా ఊహించుకొని జాగ్రత్తపడడం ఇటువంటి విషయాలలో మేలుకాబట్టి ఆ పనే చేద్దాం.

ఈ కొత్త చట్టానికి ఆర్డినెన్స్ రూపం ఇచ్చి రాష్ట్రపతి ఆమోదంకోసం ఢిల్లీకి పంపించారన్న వార్తలొక పక్క పత్రికలలో వస్తుండగానే, ప్రతిపాదిత చట్టంలోని ప్రధాన అంశాలు అనే శీర్షికతో ఎవరి పేరూ సంతకం లేని పత్రమొకటి హైదరాబాద్‌లోని ప్రతిపక్ష పార్టీలకూ పత్రికలకూ ప్రభుత్వ ప్రతినిధులు అందజేసి 'దీనిపైన అఖిలపక్ష సమావేశం జరుపుతాం' అన్నారు. ఆ సమావేశం ఇప్పటికి జరగలేదు. అట్లాగని ఆర్డినెన్సూ జారీ కాలేదు.

అయినప్పటికీ ఆ కాగితం ముక్కనే చర్చించుకుందాం.

ఈ కొత్త చట్టం ఉద్దేశ్యం సంఘటిత నేరాలను ఎదుర్కొనడమంట. సంఘటిత నేరాలంటే ఏమిటంటే భూమి కబ్జాలు, బలవంతపు డబ్బు వసూలు, మాఫియా చర్యలు, మాదకద్రవ్యాల వ్యాపారం వగైరాలు.

వీటిని ఎదుర్కొనడానికి ఇప్పటికే ఒకటికి రెండు చట్టాలున్నాయి. భూమి కబ్జా అనేది భారత శిక్షాస్మృతి కిందనేరం. అంతేకాక దానిని ఎదుర్కొనడానికి ఏకకాలంలో సివిల్, క్రిమినల్ అధికారాలుగల భూమి కబ్జా కోర్టులున్నాయి. వాటికొక ప్రత్యేక చట్టం ఉంది. మాదకద్రవ్యాల వ్యాపారాన్ని ఎదుర్కొనడానికి చాలా కఠినమైన శిక్షలతో కూడిన ఎన్‌డిపిఎస్ చట్టము, స్పెషల్ కోర్టులు ఉన్నాయి. మాఫియా వ్యవహారాలను అరికట్టడానికి శిక్షాస్మృతేకాక, 'ముందు జాగ్రత్త'గా జైలులో పడేసే అధికారం కల్పించే ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టాలున్నాయి.

ఇప్పుడున్న ఈ చట్టాలను ఎంతబాగా అమలు చేసారని ఇప్పుడు కొత్త చట్టం కావాలంటే? ఇవి అమలుకాకపోవడానికి ప్రధాన కారణం రాజకీయ సంకల్పంలోపించడమేనని వేరే చెప్పనవసరం లేదు. ఈ 'అసాంఘిక నేరాలు' చేసే వారిలో మెజారిటీ పాలక పార్టీకి అస్మదీయులే కాబట్టి పోలీసులొకవేళ అవినీతి దౌర్బల్యాన్ని జయించి వారిపైన చర్య తీసుకోవాలని ప్రయత్నించినా ఆ ప్రయత్నం సాగదు. హైదరాబాద్‌నే ఉదాహరణగా తీసుకున్నట్టయితే, మాఫియా పద్ధతిలో బలవంతపు ఆస్తి పరిష్కారాలు చేస్తున్న ఘనులలో ఇద్దరి పేర్లు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఒకరు పోలీసుశాఖకు చాలా కావలసినవాడైన మాజీ నక్సలైట్ కత్తుల సమ్మయ్య, ఇంకొకరు తెలుగుదేశం ఎంఎల్ఏ పరిటాల రవి. వీళ్ళను అదుపు చేయకుండా ఉండేదానికి గల కారణాలకు కొత్త చట్టం విరుగుడు అవుతుందా? కొత్త చట్టం తీసుకురావలన్న మన పాలకుల కోరికకుగల కారణాన్ని ఇక్కడ వెతికి ప్రయోజనం లేదు. అదివేరే చోట వుంది.

నేర విచారణ పద్ధతి మరీ 'ఉదారంగా' ఉందనీ దానివల్ల కోర్టులు ఎవ్వరినీ శిక్షంచలేని దుర్బల వ్యవస్థలుగా తయారయ్యాయనీ మనం తరచూ వింటుంటాం. 'ఉదారంగా' ఉండడమంటే ఏమిటంటే నేర విచారణలో సహజ న్యాయసూత్రాలను పాటించడం. ముద్దాయికి తన పైన ఉన్న అభియోగమేమిటో పూర్తిగా చెప్పాలి. ముద్దాయి సమక్షంలోనే నేర విచారణ జరపాలి. తనపైన ఉన్న అభియోగాన్ని తనకు వ్యతిరేకంగా నమోదయిన సాక్ష్యాన్ని పూర్తిగా ఎదుర్కొనే అవకాశం ముద్దాయికి ఇవ్వాలి. బలవంతంగా ముద్దాయి చేత నేరం ఒప్పించడానికి వీలు లేదు. నేర విచారణ సక్రమంగా జరిగేదీలేనిదీ అందరూ చూడగలిగేటట్లు నేర విచారణ బహిరంగంగా జరగాలి. 'రుజువు చేసే భారాన్ని' ప్రాసిక్యూషనే స్వీకరించాలి అనేవి నేరవిచారణ వ్యవస్థలోని సహజ న్యాయసూత్రాలు. వీటిలో దేనిని తొలగించాలి? దేనిని తొలగించడమైనా న్యాయమా? తొలగించి నట్టయితే నిర్దోషికి శిక్షపడదన్న భరోసా ఉంటుందా? అమాయకులు బలికారన్న గ్యారంటీ ఉంటుందా?

ఈ చర్చ చేసేటప్పుడు ఆ నేరం ఎంత హేయమయినది అనేది అప్రస్తుతం. ఎంతటి హేయమయిన నేరాన్ని విచారించేటప్పుడయినా సహజ న్యాయసూత్రాలననుసరించి విచారించాలనేది ఒక నాగరిక విలువ.

అయితే హేయమైన నేరాలు చేసే వారు సహజ న్యాయసూత్రాలు కల్పించే రక్షణను వాడుకొని తప్పించుకోగలుగుతున్నారన్న విషయం సహజంగానే ఆందోళన కలిగిస్తుంది. నేరానికి జవాబంతా క్రిమినల్ కోర్టులోనే దొరకాలనుకున్నంతకాలం ఈ సందిగ్ధానికి పరిష్కారం ఉండదు. నేరానికి కారణాన్నీ, జవాబును కూడా ప్రధానంగా కోర్టుబయటే వెతకాలన్న విషయాన్ని గ్రహించినట్టయితేనే కోర్టులో పాటించే సహజ న్యాయసూత్రాలను గౌరవిస్తూ కూడా నేరరహితమైన సమాజాన్ని కాంక్షించగలుగుతాం.

ఇది ప్రజల మనసులలో ఉన్న సందిగ్ధంకాగా, పోలీసులూ, పోలీసుబుద్ధి ఉన్న పాలకులు సహజ న్యాయసూత్రాలను 'లా అండ్ ఆర్డర్'కు ఒక పెద్ద ఆటంకంగా చూస్తారు. ఈ ఉదారవాద చాదస్తమంతా పెట్టుకోకుండా చకచకా కేసులు విచారించేసి శిక్షలు (న్యాయంగానో, అన్యాయంగానో) వేసేస్తుంటేనే శాంతి భద్రతలకు భరోసా ఉంటుందని భావిస్తారు. అప్పుడు నేరానికి బయటి సమాజంలో ఉన్న కారణాల గురించి ఆలోచించనక్కరలేదు. వాటిని తొలగించడానికి ఆలోచించనక్కరలేదు. అయినప్పటికీ 'నేరస్తులంతా తప్పించుకుంటున్నారు' అన్న విమర్శను ఎదుర్కో వచ్చు, 'శాంతి'ని గట్టిగా స్థాపించవచ్చు.

అందుకే సహజ న్యాయసూత్రాలకు తూట్లు పొడిచే ప్రయత్నాలు పదేపదే జరుగుతుంటాయి. ఈ ప్రయత్నం ఎప్పుడు చేసినా, హేయమయిన నేరాలను కారణంగా చూపిస్తుంటారు. వాటికి మాత్రమే ఈ సవరణ వర్తిస్తుందంటారు. సమాజం ఆమోదం పొందుతారు. కానీ నేరంమీద దృష్టి నేరవిచారణ పద్ధతిని మనం దిగజారనిస్తే, సహజ న్యాయ సూత్రాలు అనుల్లంఘనీయం కాదని సూత్రప్రాయం ఒప్పుకున్న వాళ్ళమవుతాము. అది చాలా తప్పు. నిర్దోషిని శిక్షించడానికి వీలులేదనేది నేర స్వభావంతో నిమిత్తంలేని ఒక ఉన్నతమైన నాగరికతా విలువ. అంతేకాకుండా, ఇవ్వాళ ఒకరకమైన నేరందగ్గర మొదలయినది రేపు ఇతర నేరాలకు కూడా వ్యాపించడం పెద్దకష్టంకాదు. అప్పుడు అడ్డుకోవడానికి మన దగ్గర సూత్రబద్ధమైన వాదన లేవీ ఉండవు. ఇంతకూ ప్రతిపాదిత చట్టంలో ఏ మార్పులు తేబోతున్నారు? ఒకటి: పోలీసు కస్టడీలో ముద్దాయిచేత నేరం ఒప్పించి ఒప్పుకోలు పత్రం రాయించుకుంటే అది కోర్టులో సాక్ష్యంగా చెల్లుబాటవుతుంది. రెండు: ముద్దాయికి ఛార్జిషీటు ఇచ్చేటప్పుడు కేసులో సాక్ష్యం చెప్పబోయేవాళ్ళ పేర్లు అందులో రాయరు. మూడు: బెయిలు దాదాపు అసాధ్యం అవుతుంది. బెయిలు పిటిషన్ విచారించే టప్పుడు, ముద్దాయి నేరవిచారణకు అడ్డుపడకుండా ఉండాలన్నదొక్కటే సహేతుకమైన ప్రమాణం. దానిబదులు ముద్దాయి నిర్దోషి అని కోర్టు భావిస్తేనే బెయిలు ఇవ్వాలన్న అప్రస్తుతమైన నియమం పెట్టబోతున్నారు. నాలుగు: నేర విచారణ రహస్యంగా జరుపుతారు. క్లుప్తంగా చెప్పాలంటే, టాడాలో ఉండిన అభ్యంతరకరమైన నేర విచారణ పద్ధతులన్నీ ఇందులో ఉన్నాయి. (నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకునే భారం కొన్ని సందర్భాలలో ముద్దాయిపైననే పెట్టే నియమమొక్కటి తప్ప)

ఇది సూత్రప్రాయంగా అభ్యంతరకరమని పైన చెప్పాను. అంతేకాక ఆచరణలో దుర్వినియోగానికి కూడా ఆస్కారం ఉంది. 'భూమి కబ్జా' అంటే ఏమిటి? ఇప్పటికే ఉన్న భూమి కబ్జా చట్టం కింద ఘరానా కబ్జాదారులెంతమందిని బోనెక్కించారో తెలీదుగానీ, దశాబ్దాల తరబడి ఒక జాగాలో నివశిస్తున్న గుడిసెవాసులను ఖాళీ చేయించిన ఉదంతాలు చూసాము. ఆ చట్టం నుండి కనీసం సహజ న్యాయసూత్రాలను వెలివేయడం లేదు. విచారణ పద్ధతి న్యాయంగానే ఉంటుంది. ఇప్పుడు విచారణ పద్ధతిని 'టాడా' స్థాయికి దిగజార్చి భూమి కబ్జాను ఆ పద్ధతిలో విచారించే నేరంగా మార్చినట్టయితే గుడిసెవాసుల గతేమవుతుంది?

అంతేకాదు. భూమి కోసం పట్టణాలలో, గ్రామాలలో, ఏజెన్సీ ప్రాంతాలలో పేదలు, దళితులు, ఆదివాసీలు చేసే పోరాటాలు కూడా చట్టం కళ్ళలో భూమి కబ్జా నేరాలేకదా! ప్రస్తుతం ఆ ప్రజలమీద, ఉద్యమకారులమీద, ఐపిసి కేసులు పెడుతున్నారు. అదొక ఎత్తయితే ఇప్పుడీ కొత్తచట్టం ప్రయోగించడం మొదలుపెడితే ఏమవుతుంది?

'బలవంతపు డబ్బు వసూలు' అనేదికూడ దుర్వినియోగానికి ఆస్కారమిచ్చే విషయమే. ఏది బలవంతం అనేది విచారణ అనంతరం కదా తేలేది! కేసుపెట్టేవరకయితే అన్ని రకాల డబ్బు వసూలుపైనా పెట్టొచ్చు. ఇప్పటికే చాలామంది ఉద్యమకారులపైన ఏ ఆయుధాలూ లేకుండా పూర్తిగా శాంతియుతంగా పనిచేసే ఉద్యమ కారులపైన కూడా ఐపిసిలోని 'ఎక్స్‌టార్షన్' సెక్షన్ కింద కేసులుపెడుతున్నారు. ఇప్పుడు నేర విచారణలో సహజ న్యాయసూత్రాలున్నాయి కాబట్టి అవి బలవంతపు వసూలు అని రుజువు చేయడం ప్రాసిక్యూషన్‌కు సులభంకాక పోవచ్చు. కానీ ఈ కొత్త చట్టం కింద కేసులుపెడితే, లాకప్పులో కొట్టి ఒప్పించయినా 'రుజువు' చేసేయొచ్చు. లేదా మఫ్టీ పోలీసులనే అకస్మాత్తుగా బోనెక్కించి 'సాక్ష్యం' చెప్పించేయొచ్చు.

గ్లోబలైజేషన్ పేరిట ప్రజల సామాజిక ఆర్థిక హక్కులొక్కొక్కటీ తీసేస్తూ సమాజంలో అశాంతిని ప్రభుత్వమే పనిగట్టుకొని పెంచుతున్న ఈ తరుణంలో ఇటువంటి అణచివేత చట్టాలను నేరస్మృతిలోనికి రానివ్వడం ప్రజల పౌర, రాజకీయ హక్కులకు చాలా ప్రమాదకరం. ★